# తెలంగాణలో వెల్లివిరిసిన నీలి విప్లవం

- మంచినీటి చేపల పెంపకంలో ఉత్తమ అవార్డు
- బెస్ట్ ఇన్‌ల్యాండ్ స్టేట్‌గా ఎంపిక చేసిన కేంద్రం
- బీఆర్‌ఎస్ హయాంలో పెరిగిన మత్స్య సంపద
- కేసీఆర్ కృషితో ఎనిమిదేండ్లలో 69శాతం వృద్ధి
- కాంగ్రెస్ ఏడాది పాలనలో మత్స్యరంగం నిర్వీర్యం

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, కులవృత్తులపై ఆధారపడ్డవారికి ఆదాయం పెంచడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విశేష కృషి చేశారు. దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రణాళికలు అమలు చేశారు. నాటి అభివృద్ధి ఫలాలు నేటికీ అందుతున్నాయి. రాష్ర్టాన్ని దేశంలోనే ఉత్తమంగా నిలుపుతున్నాయి. తాజాగా మంచినీటి చేపల పెంపకంలో దేశంలోనే తెలంగాణ ఉత్తమ రాష్ట్రంగా నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు బెస్ట్ ఇన్‌ల్యాండ్ ఫిష్ స్టేట్ అవార్డును ప్రకటించింది. మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన చేప పిల్లల ఉచిత పంపిణీ పథకం వల్ల నీలి విప్లవం వెల్లివిరిసింది. అద్భుతమైన రీతిలో మత్స్య సంపద పెరిగింది. మత్స్యకారవర్గం సాధికారికంగా ఎదిగింది. మత్స్య ఉత్పత్తిలో మైనస్‌లో ఉన్న తెలంగాణ రాష్ర్టాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 69శాతం వృద్ధిరేటుకు చేర్చింది.

### చేపల ఉత్పత్తి... సంపద వృద్ధి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కాక ముందు చేపల కొరత ఉండేది. కానీ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మత్స్య సంపద పెంచి మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నాటి సీఎం కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీకి శ్రీకారం చుట్టారు. 2016లో ప్రారంభించిన ఈ పథకం రాష్ట్రంలో మత్స్య సంపదను భారీగా పెంచింది. పథకం కింద ఏటా రూ.100 కోట్ల ఖర్చుతో సుమారు 120 కోట్ల చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేసింది. ఈ విధంగా చేప పిల్లల ఉచిత పంపిణీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.600 కోట్ల వరకు ఖర్చు చేసింది. తద్వారా 2016-17లో ఏడాదికి 1.93 లక్షల టన్నులుగా ఉన్న చేపల ఉత్పత్తి.. ప్రస్తుతం 4.39 లక్షల టన్నులకు పెరిగింది. చేపల ఉత్పత్తిలో తెలంగాణ 69శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. చేపల ఉత్పత్తితో పాటు మత్స్యకారుల సంపద కూడా పెరిగింది. చేపల ఉత్పత్తి ద్వారా రూ. 36వేల కోట్లకు పైగా సంపద సృష్టి జరిగింది. తద్వారా రాష్ట్రంలోని మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమయ్యారు.



### కాంగ్రెస్ ఏడాది పాలనలో నిర్వీర్యం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనిమిదేండ్ల పాటు చేప పిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని నిర్విఘ్నంగా కొనసాగించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చేప పిల్లల పంపిణీ పథకాన్ని సర్కారు నిర్వీర్యం చేసింది. పథకాన్ని పూర్తిగా అటకెక్కించేందుకు ప్రయత్నించింది. కానీ మత్స్యకారులు గట్టిగా నిలదీయడంతో తూతూమంత్రంగా చేప పిల్లలను పంపిణీ చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో 80 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయగా ఈ సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 40 కోట్ల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేసింది. దీంతో ఉత్పత్తి తగ్గి, వృద్ధిరేటు పడిపోయింది.

#### రొయ్య పిల్లల పంపిణీ, ఖర్చు

| సంవత్సరం | ఖర్చు కోట్లలో | రొయ్యల సంఖ్య కోట్లలో |
|---|---|---|
| 2017-18 | 1.38 | 1.08 |
| 2018-19 | 6.27 | 3.19 |
| 2019-20 | 6.39 | 3.42 |
| 2020-21 | 8.61 | 4.01 |
| 2021-22 | 20.85 | 8.01 |
| 2022-23 | 21.23 | 8.62 |
| 2023-24 | 10.00 | 25.99 |
| మొత్తం | 74.73 | 54.33 |

### దాచేస్తే దాగని సత్యం-చెరిపేస్తే చెరగని చరిత్ర



తెలంగాణలో కేసీఆర్ సాధించిన నీలి విప్లవం దాచేస్తే దాగని సత్యం.. చెరిపేస్తే చెరగని చరిత్ర అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. 2016-17లో 1.93లక్షల టన్నుల చేపల పెంపకం నుంచి 2023-24కు 4.39లక్షల టన్నులకు ఎగబాకడమే సాక్ష్యమని తెలిపారు. రాష్ట్రం చేపల పెంపకంలో ఉత్తమ "ఇన్‌ల్యాండ్ స్టేట్"గా అవార్డు కైవసం చేసుకోవడం కేసీఆర్ విజయమని పేర్కొన్నారు.

#### చేప పిల్లల పంపిణీ, ప్రభుత్వ చేసిన ఖర్చు

| సంవత్సరం | చేప పిల్లల సంఖ్య | ఖర్చు | ఉత్పత్తి | విలువు | వృద్ధిరేటు |
|---|---|---|---|---|---|
| 2016-17 | 27.85 | 22.46 | 1.93 | 2111 | -15.10 |
| 2017-18 | 51.08 | 44.60 | 2.62 | 3419 | 35.37 |
| 2018-19 | 49.15 | 42.95 | 2.84 | 3742 | 8.17 |
| 2019-20 | 64.08 | 46.63 | 2.99 | 4332 | 5.51 |
| 2020-21 | 68.52 | 51.80 | 3.37 | 4847 | 12.42 |
| 2021-22 | 76.75 | 77.49 | 3.76 | 5411 | 11.58 |
| 2022-23 | 76.70 | 63.00 | 4.24 | 6191 | 12.81 |
| 2023-24 | 85.60 | 84.13 | 4.39 | 6514 | 3.58 |
| మొత్తం | **499.73** | **433.06** | **26.14** | **36,657** | **69.04** |

(నోట్: చేప పిల్లల సంఖ్య- కోట్లలో, ఖర్చు రూ. కోట్లలో, ఉత్పత్తి- లక్షల టన్నులు, విలువ- రూ.కోట్లలో)

# రేవంత్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం క్లాస్!

- అదానీతో ప్రభుత్వ ఒప్పందాలపై ఆగ్రహం
- అదానీ అక్రమాలపై మేము కొట్లాడుతుంటే.. నువ్వు దోస్తీనా అంటూ సీరియస్
- ప్లేట్ ఫిరాయించిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు
- రాహుల్ మాటే మా బాట అంటూ సూక్తులు

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): అదానీతో ఒప్పందాల వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం గట్టిగానే క్లాస్ పీకినట్టు తెలిసింది. రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఫోన్ చేసిన అధిష్ఠానం పెద్దలు గట్టిగానే హెచ్చరికలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. 'ఇదేం పద్ధతి?' అని ఘాటుగానే వ్యాఖ్యానించినట్టు తెలిసింది. తామేమో జాతీయ స్థాయిలో అదానీ అక్రమాలపై కొట్లాడుతుంటే .. నువ్వేమో రాష్ట్రంలో ఆయనతో కుమ్మక్కవుతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. 'మేం అదానీపై ప్రశ్నిస్తుంటే.. బీజేపీ నేతలు నీ ఒప్పందాలను చూపుతున్నారు. మేం ఏం సమాధానం చెప్పాలి. మా ముఖం ఎక్కడ పెట్టుకోమంటావ్.' అంటూ మండిపడినట్టు తెలిసింది. వివరణ ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది.

### రేవంత్ తీరుతో ఇరకాటం

సీఎం రేవంత్‌రెడ్డి తీరుతో కాంగ్రెస్ అధిష్ఠానం ఇరకాటంలో పడింది. ఓవైపు రాహుల్‌గాంధీ జాతీయస్థాయిలో అదానీ-మోదీ అవినీతిని ఎండగడుతుంటే.. ఇక్కడ మాత్రం రేవంత్‌రెడ్డి అదానీతో అంటకాగుతూ ఒప్పందాలు చేసుకున్నారు. దావోస్‌లో అదానీతో భేటీ అయిన రేవంత్‌రెడ్డి రూ.12,400 కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఇటీవల అదానీ నుంచి స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం అందుకున్నారు. అంతకుముందు అదానీ కుమారుడు కరణ్ అదానీతోనూ రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. మరో మంత్రి పొంగులేటి అదానీతో, అదానీ కొడుకుతో కూడా రహస్యంగా భేటీ అయినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం పరిస్థితి కుడితిలో పడిన ఎలకలా తయారైంది. అదానీపై అమెరికాలో కేసు నమోదుతో.. బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్నది. కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు బీజేపీ నేతలు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అదానీతో చేసుకున్న ఒప్పందాలను చూపుతూ కౌంటర్ ఇస్తున్నారు. దీంతో అధిష్ఠానం ఇరకాటంలో పడింది.

### ప్లేట్ ఫిరాయించిన నేతలు..

మొన్నటివరకు అదానీతో రేవంత్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాలను సమర్థించిన కాంగ్రెస్ కీలక నేతలు ఇప్పుడు ప్లేట్ ఫిరాయించారు. చట్టవిరుద్ధంగా ఉంటే అదానీ ఒప్పందాలను రద్దు చేస్తామని, రాహుల్ మాటే తమ మాట... ఆయన బాటే తమ బాట అంటూ సూక్తులు చెప్తున్నారు. అదానీతో ఒప్పందాలపై వరుస ప్రెస్‌మీట్లు పెడుతున్నారు. గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అదానీపై అంశంపై మాట్లాడగా... శుక్రవారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రత్యేకంగా ప్రెస్‌మీట్ పెట్టారు. మొన్నటివరకు అదానీతో ఒప్పందాలను సమర్థించిన వీరంతా ఇప్పుడు ఖండించే విధంగా మాట్లాడడంపై కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.

# అదానీతో రేవంత్ బిజినెస్ చేయొద్దు

- పార్టీ సహచరిగా చెబుతున్నా
- ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): అదానీతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బిజినెస్ చేయొద్దని ఏపీపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. అదానీ గ్రూప్ సంస్థలను తెలంగాణ ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. దేశంలోనే అతిపెద్ద ఆర్థిక నేరగాడితో వ్యాపారం చేయడం సరికాదని పేర్కొన్నారు. అదానీ ఎన్ని అక్రమాలకు పాల్పడినా ప్రధాని మోదీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

### ప్రభాస్ ఎవరో తెలియదు..

ప్రభాస్‌తో తనకు సంబంధం ఉన్నట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రభాస్ ఎవరో తనకు తెలియదని, ఇప్పటి వరకు ఆయనను చూడనేలేదని స్పష్టంచేశారు. ఆ తప్పుడు ప్రచారాన్ని జగన్‌కు చెందిన సోషల్ మీడియా చేసిందని ఆరోపించారు. అది బాలకృష్ణ ఇంటి ఐపీ అడ్రస్‌తో వచ్చిందని, జగన్ సానుభూతి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

### అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలి

అదానీ గ్రూప్ కంపెనీల అక్రమ వ్యవహారాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) విచారణ చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర నగర కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. మోదీ-అదానీ అనుబంధం దేశానికి పెనుముప్పుగా పరిణమించిందని తెలిపారు. అదానీ లాంటి కార్పొరేట్ అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని, లేదంటే దేశసంపద బడాబాబుల జేబుల్లోకి వెళ్తుందని తెలిపారు. కేంద్రం అదానీకి ఇచ్చిన ప్రాజెక్టులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, వివేకానంద, సంజయ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

# దొంగతో దోస్తానా?

మొదటిపేజీ తరువాయి...

సృష్టించిన తెలంగాణ సంపదను క్రోనీ క్యాపిటలిస్టులు దోచుకునేలా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదానీపై అమెరికా కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేయగానే, చిన్న దేశమైన కెన్యా అదానీతో జరిగిన ఒప్పందాలన్నీ రద్దు చేసుకున్నదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా అదానీ సంస్థల ఒప్పందాలను రద్దు చేసుకోవడంతోపాటు అదానీ స్కిల్ వర్సిటీకి ఇచ్చిన రూ.100 కోట్లను కూడా వాపస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదానీ విషయంలో కాంగ్రెస్, బీజేపీ విధానం ఒక్కటే అన్నట్టు అనిపిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ కే సంజయ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

> రేవంత్‌రెడ్డి మహారాష్ట్రకు వెళ్లి అదానీ గజదొంగ అంటారు. హైదరాబాద్ రాగానే గజమాల వేసి స్వాగతం పలుకుతారు. కేసీఆర్ పదేండ్లలో సృష్టించిన తెలంగాణ సంపదను క్రోనీ క్యాపిటలిస్టులు దోచుకునేలా చేస్తారా? అదానీపై కేసులు పెట్టాలా వద్దా? అరెస్టు చేయాలా వద్దా? రాహుల్ చెప్పినట్టు అదానీది అవినీతి సంస్థనా కాదా? మరి ఏ కారణం చేత అదానీతో దోస్తీ కట్టారో రేవంత్‌రెడ్డి ప్రజలకు చెప్పాలి. -కేటీఆర్

### అంతర్జాతీయంగా మసకబారిన దేశ ప్రతిష్ఠ

అదానీ బండారం అంతర్జాతీయంగా మళ్లీ బయటపడిందని, అమెరికా నుంచి ఆఫ్రికా వరకు అదానీ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. అదానీ వ్యవహారాలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేయాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని, ఆయనపై కేసు పెట్టాలని, తాము ఎన్నిసార్లు కోరినా ప్రధాని మోదీ పట్టించుకోలేదని విమర్శించారు. అదానీ కంపెనీల అవకతవకలు మరోసారి బయపడ్డాయని, ఇప్పుడు సీబీఐ కాదు ఎఫ్‌బీఐ రంగంలోకి దిగిందని తెలిపారు. గతంలో హిండెన్‌బర్గ్ అనే సంస్థ కూడా అవకతవకలు జరిగినట్టు తేల్చిందని తెలిపారు. అదానీని ప్రధాని వెనకేసుకు రావడం వల్ల భారతదేశ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా మసకబారిందని వాపోయారు.

> పారిశ్రామికవేత్తలు ఎవరూ ఊరికే విరాళాలివ్వరని మహారాష్ట్ర ఎన్నికల సభల్లో రాహుల్‌గాంధీ చెప్పారు. నీకిది నాకది అని ఏదో పెద్దదే ఆశించి ఇస్తారన్నారు. మరిక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్లు అదానీ నుంచి విరాళం తీసుకున్నది. రాహుల్‌గాంధీకి తెలిసి తీసుకున్నారా? తెలియకుండానా -కేటీఆర్

అదానీ ఎన్నిసార్లు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ప్రయత్నించినా తాము రానివ్వలేదని గుర్తుచేశారు. 'దేశంలోని అనేక రాష్ర్టాల్లో కేంద్రం సహకారంతోనే అదానీ కోరలు విస్తరించాయి' అని ధ్వజమెత్తారు. దేశం గర్వపడే బడాబడా పారిశ్రామికవేత్తలను బెదిరించి బలవంతంగా పోర్టులను లాగేసుకున్న చీకటి చరిత్ర అదానీదని విమర్శించారు. అలాంటి అదానీ సామ్రాజ్యాన్ని తెలంగాణలో అడుగుపెట్టకుండా పదేండ్లపాటు నిలువరించామని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ బంగారు గనిలా తయారైందన్నారు. అందుకే అదానీ కన్ను తెలంగాణపై మరోసారి పడిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే బడేభాయ్ ఆదేశాలమేరకు చోటేభాయ్ అదానీతో డీల్ కుదుర్చుకున్నారని మండిపడ్డారు. రాహుల్ అవినీతిపరుడు అన్న వ్యక్తికే రేవంత్ రెడ్‌కార్పెట్ పరిచారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని, కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్‌కు ఉన్న తేడా ఇదేనని స్పష్టంచేశారు.

### కాంగ్రెస్ రాగానే అదానీ వ్యాపార విస్తరణ

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అదానీ సంస్థలతో రూ.12,400 కోట్ల మేరకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు ఘనంగా చెప్పుకున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'రూ.5,000 కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, మరో రూ.5,000 కోట్లతో రెండు డాటా సెంటర్లు, రూ.1,400 కోట్లతో అంబుజా సిమెంట్స్, రూ.1,000 కోట్ల ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ కోసం ఒప్పందాలు చేసుకున్నారు. వీటితోపాటు తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలను (డిస్కంలు) అదానీకి అప్పగించేందుకు ఓల్డ్ సిటీ బిల్లుల వసూళ్ల డ్రామా మొదలుపెట్టారు. వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్ర చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్స్ కోసం బలవంతంగా అభిప్రాయ సేకరణ చేపట్టారు. సిమెంట్ పరిశ్రమ వద్దని ప్రజలు వ్యతిరేకిస్తున్నా కాంగ్రెస్ పట్టించుకోలేదు. ఏ మూసీ శుద్ధి అంటున్నారో అదే మూసీ సిమెంట్ ఫ్యాక్టరీ కారణంగా మురికిమయం అవుతుందని చెప్పినా పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి అదానీకి సహకరించే పని చేశారు. ఇలా తెలంగాణలో అదానీ సామ్రాజ్య విస్తరణకు ప్రయత్నించారు. రేవంత్‌రెడ్డి ఇంట్లో నాలుగు గంటలపాటు అదానీ సమావేశమయ్యారు. స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. ఈ వ్యవహారాలన్నీ కుట్ర అని మేము భావిస్తున్నాం. ఇప్పుడు మేల్కొనకపోతే స్వాతంత్ర్యం రాకముందు దేశం ఈస్టిండియా కంపెనీ కబంధ హస్తాల్లో చిక్కుకున్నట్టు స్వరాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ వెస్ట్ ఇండి యా కంపెనీ చేతుల్లో విలవిలలాడబోతున్నది' అని హెచ్చరించారు.

### సామ్రాజ్య వ్యాప్తితో రాహుల్ వాటా ఎంత?

'చిన్న కార్పొరేషన్ పదవికి కూడా కాంగ్రెస్‌లో హైకమాండ్ పర్మిషన్ కావాలె. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కూడా ఇప్పటివరకు అధిష్ఠానం అనుమతి ఇవ్వలేదు. అలాంటిది అదానీతో ఒప్పందాలకు కాంగ్రెస్ హైకమాండ్ పర్మిషన్ లేదని భావించాలా?' అని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. రోజూ అదానీని విమర్శించే రాహుల్‌గాంధీ ఈ ఒప్పందాలకు మద్దతిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఈ వ్యాపార సామ్రాజ్య నిర్మాణంలో రాహుల్‌గాంధీ వాటా ఎంత? రాహుల్‌కి, ఢిల్లీకి అందుతున్న ఆర్‌ఆర్ ట్యాక్స్‌లో అదానీ వాటా ఎంత? అని ప్రశ్నించారు.

### రాహుల్ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్ప

అదానీతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దందాలను రాహుల్ సమర్థిస్తున్నారా? సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'తెలంగాణ కన్నా తక్కువ తలసరి ఆదాయం ఉన్న కెన్యా ప్రభుత్వం ఆత్మగౌరవంతో వ్యవహరించింది. అదానీపై అమెరికా కోర్టు తీర్పు ఇవ్వగానే అదానీతో మొత్తం వ్యాపార సంబంధాలను రద్దు చేసుకుంటున్నట్టు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. కెన్యా రవాణాశాఖ, ఇంధనశాఖ, విద్యుత్తు, ఎయిర్ పోర్ట్ నిర్వహణతోపాటు వివిధ ఏజెన్సీల ఒప్పందాలు ఏవైనా ఉంటే వెంటనే రద్దు చేసుకోవాలని ఆదేశించారు. అదానీ దుర్మార్గుడని రాహుల్‌గాంధీ అంటుంటారు.. మరి కెన్యా ప్రభుత్వం ఒప్పందాలు రద్దు చేసుకుంటే మీరెందుకు అదానీతో ఒప్పందాలు రద్దు చేయటం లేదు? అదానీ నుంచి ఎంత ఆశించి మీరు రూ.12,400 కోట్ల వ్యాపార ఒప్పందాలు చేసుకున్నారు? ప్రధానితో అదానీ దోస్తీని విమర్శించే రాహుల్‌గాంధీ.. అదానీతో రేవంత్‌రెడ్డి దోస్తీచేస్తే ఎందుకు ఊరుకుంటున్నారు? అదానీతో దేశానికి నష్టమనే రాహుల్‌గాంధీ.. తెలంగాణకు ఏ విధంగా మేలో చెప్పాలి. కాంగ్రెస్ హైకమాండ్‌ను కాదని తెలంగాణలో అదానీకి రెడ్ కార్పెట్ వేశారా? అలాగైతే కాంగ్రెస్ పరంగా అది చాలా నష్టం చేసేపనే. వెంటనే రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి. స్కిల్ యూనివర్సిటీకి విరాళం సరైనదేనని రాహుల్‌గాంధీ భావిస్తున్నారా? అదానీతో ప్రధాని వ్యాపారం చేస్తున్నాడని ఆయన అవినీతిపరుడని చెప్తున్న రాహుల్‌గాంధీ.. అదే అదానీతో రేవంత్‌రెడ్డి వ్యాపారం చేస్తే నీతిపరుడు ఎలా అవుతారు? రాహుల్‌గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రేవంత్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

> రాహుల్‌తో జాతీయ స్థాయిలో ఢీ అంటే ఢీ అనే బీజేపీ నేతలు రాష్ట్రంలో రేవంత్‌తో మాత్రం దోస్త్ మేరా దోస్త్ అన్నట్టుగా ఎందుకు వ్యవహరిస్తున్నారు? అదానీ అవినీతి సామ్రాజ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు కాబట్టే మూసీ అవినీతి ప్రాజెక్టుకు బీజేపీ సహకరిస్తున్నదా? అదానీ అవినీతి పెట్టుబడులు తెస్తున్న రాష్ర్టాలన్నీ కాంగ్రెస్ పాలిత రాష్ర్టాలే అంటున్నారు. తెలంగాణలో అదానీ పెట్టుబడులపై బీజేపీ విధానం స్పష్టంచేయాలి. -కేటీఆర్

### బీజేపీ ఎందుకు స్పందించదు?


అదానీ సంస్థలతో రేవంత్‌రెడ్డి ఒప్పందాలు చేసుకొని దేశ ప్రతిష్ఠను మంటగలుపుతుంటే బీజేపీ ఎందుకు స్పందించటం లేదని కేటీఆర్ నిలదీశారు. 'అదానీతో ఒప్పందాలు రద్దు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణలో అదానీ పెట్టుబడులపై బీజేపీ విధానం స్పష్టంచేయాలి. రాష్ట్రంలో అదానీకి కాంగ్రెస్ రెడ్ కార్పెట్ వేస్తున్నది. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా అదానీకి రెడ్ కార్పెట్ వేస్తున్నది. జాతీయస్థాయిలో, రాష్ట్ర స్థాయిలో మీ విధానం ఏమిటి? అదానీ విషయంలో రేవంత్‌రెడ్డి చేస్తున్నది బీజేపీకి సమ్మతమేనా? రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయ సేకరణను అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించాయి. కానీ కాంగ్రెస్, బీజేపీ మాత్రమే నోరు విప్పలేదు. అదానీ వ్యవహారంలో వీరి బంధం ఏ విధంగా ఉన్నదో తెలంగాణ ప్రజలు కూడా ఆలోచించాలి. అదానీ గండం నుంచి తెలంగాణ గట్టెక్కే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. ఏనాడైనా తెలంగాణను కాపాడే పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమే' అని కేటీఆర్ స్పష్టంచేశారు.

### మీడియా ఎందుకు అడగదు?

అదానీ అవినీతిలో బీఆర్‌ఎస్ లేవనెత్తిన అంశాలపై ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిని మీడియా ప్రశ్నించాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. బాంబుల శాఖ మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ జరిగి ఆరు వారాలు అవుతున్నా ఇప్పటి వరకు బీజేపీ నుంచి, ఈడీ నుంచి ఒక్క మాట కూడా ఎందుకు బయటరాలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయంలో రీజనబుల్ పీరియడ్‌లోపు నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. అంటే మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి ఎంత మొరిగినా తాము మాత్రం సబ్జెక్టే మాట్లాడతామని స్పష్టంచేశారు.

### రేవంత్‌రెడ్డీ.. ప్రజలకు జవాబివ్వు..


కెన్యా వంటి దేశం అదానీతో ఒప్పందాలు రద్దుచేసుకుంటే తెలంగాణ ముఖ్యమంత్రి ఎందుకు వెనుకాడుతున్నారో ప్రజలకు సమాధానం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇది తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టడం కాదా? అని నిలదీశారు. 'అదానీ సంస్థతో రేవంత్ సర్కారు చేసుకున్న ఒప్పందాల పూర్తి వివరాలు తెలంగాణ ప్రజల ముందు పెట్టాలి. మహారాష్ట్రలో ఎన్సీపీ చీలికలో అదానీ హస్తం ఉందంటారు. ఆయన రాజకీయాల్లో కూడా జోక్యం చేసుకుంటున్నారని వింటున్నాం. కోహినూర్ హోటల్‌లో అదానీతో మంత్రి పొంగులేటి సమావేశంపై కూడా వివరణ ఇవ్వాలి. బీజేపీ వాషింగ్ మెషిన్‌లో పునీతులయ్యేందుకు అదానీతో సమావేశమయ్యారా?' అని కేటీఆర్ నిలదీశారు.



# అదానీ కహానీ వెనుక భారీ కుట్ర?!

'సోలార్ స్కామ్'లో కొత్త కోణం వెలుగులోకి • గత నెలలోనే అదానీపై అరెస్ట్ వారెంట్ రెడీ • జారీ కాకుండా కుట్రలకు తెర లేపింది ఎవరు? • ఎఫ్‌బీఐ విచారణనూ అడ్డుకొనేలా పావులు?! • జార్ఖండ్, మహారాష్ట్ర పోలింగ్ తర్వాతే ప్రకటన • స్కెచ్‌ను అమలు చేసిన సాగర్ అదానీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో) హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): పోటీ లేకుండా కాంట్రాక్టులను దక్కించుకొని, అధిక ధరలకు సౌర విద్యుత్తును కొనుగోలు చేసేలా పలు రాష్ర్టాల్లోని ఉన్నతాధికారులకు భారీ లంచాలను ఆఫర్ చేసిన 'అదానీ సోలార్ స్కామ్'లో కొత్త కోణం వెలుగు చూసింది. అందరూ అనుకొంటున్నట్టు అదానీ గ్రూప్ సంస్థల చైర్‌పర్సన్ గౌతమ్ అదానీపై అమెరికా కోర్టు గురువారం రోజే అరెస్ట్ వారెంట్‌ను సిద్ధం చేసి జారీ చేయలేదు. గత నెల 31నే గౌతమ్ అదానీపై అరెస్ట్ వారెంట్ రెడీ అయ్యింది. అయితే, ఆ వారెంట్ మాత్రం జారీ కాలేదు. కేసు విషయాలూ బయటకు పొక్కలేదు.



United States v. Adani

Document #11

District Court, E.D. New York

Docket Number: 1:24-cr-00433

Citation: United States v. Adani, 1:24-cr-00433, (E.D.N.Y. Oct 31, 2024) ECF No. 11

Date Filed: October 31st, 2024

Add Note | Buy on PACER

Description

Limited Unsealing Order as to Gautam S. Adani: Upon the application of BREON PEACE, United States Attorney for the Eastern District of New York, by Assistant United States Attorney Jessica K. Weigel, for an order partially unsealing the above-captioned indictment and the arrest warrant for Gautam S. Adani for the limited purpose of providing these documents to foreign law enforcement. WHEREFORE, it is ordered that the indictment be partially unsealed and the arrest warrant for Gautam S. Adani be unsealed for the above-referenced limited purpose. So Ordered by Magistrate Judge Robert M. Levy on 10/31/2024. (Attachments: # 1 Government Letter, # 2 Sealing Cover Sheet) (EF) (Entered: 10/31/2024)



అదానీపై అరెస్ట్ వారెంట్‌ను దాదాపు 22 రోజులపాటు నిలుపుదల చేయించిందెవరు? కేసు గురించి ప్రపంచానికి తెలియనీయకుండా చేసిందెవరన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.

### అసలేం జరిగింది?

దేశంలో సౌర విద్యుదుత్పత్తి సరఫరా ఒప్పందాలు చేసుకొనేందుకు ఏపీ, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాల్లోని ఉన్నతాధికారులకు అదానీ గ్రూప్ ప్రతినిధులు 265 మిలియన్ డాలర్లు (రూ. 2,238 కోట్లు) మేర లంచాలు ఇచ్చారనే అభియోగాలపై అమెరికాలోని ఈస్ట్ డిస్ట్రిక్ట్ న్యూయార్క్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ మేరకు గౌతమ్ అదానీతోపాటు ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీకి అక్కడి కోర్టు గురువారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. అయితే, గౌతమ్ అదానీపై అరెస్ట్ వారెంట్ మాత్రం అక్టోబర్ 31నే రెడీ అయ్యింది. ఈస్ట్ డిస్ట్రిక్ట్ న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి రాబర్ట్ ఎమ్ లేవీ ఈ మేరకు ఆదేశాలిచ్చారని జాతీయ మీడియా 'ఇండియా టుడే' ఒక కథనంలో వెల్లడించింది. అదానీ అక్రమాలపై అక్టోబర్ 31నే దీనే అరెస్ట్ వారెంట్ సిద్ధమైనప్పటికీ, 22 రోజుల అనంతరం దాన్ని జారీ చేయడం, ఇన్ని రోజులపాటు కేసు విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టడంపై సర్వత్రా చర్చ జరుగుతున్నది.

### ఏడాదిన్నర కిందటే ఫోన్లు సీజ్

'సోలార్ స్కామ్'లో లంచాలకు సంబంధించి ఎవరికి ఏమేరకు చెల్లించారు? ప్రతిఫలంగా ఏయే కాంట్రాక్టులు దక్కాయన్న అన్ని ఆధారాలు సాగర్ అదానీ ఫోన్‌లో తమకు లభించాయని ఎఫ్‌బీఐ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు గత ఏడాది మార్చిలో ఎఫ్‌బీఐ ప్రత్యేక ఏజెంట్లు సాగర్ అదానీని సెర్చ్ వారెంట్‌తో రెండుమార్లు కలిశారని, అమెరికాలో ఒకసారి, భారత్‌లో మరోసారి సాగర్‌ను విచారించినట్టు ప్రాసిక్యూటర్లు తెలిపారు.

### లంచాల స్కెచ్ ఇలా

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి ఎలాగోలా టెండరు దక్కించుకొన్నప్పటికీ, అధిక ధరలను కోట్ చేయడంతో విద్యుత్తు కొనుగోలుకు రాష్ర్టాల డిస్కమ్‌లు ముందుకు రాకపోవడంతో అదానీపై ఒత్తిడి పెరిగినట్టు సమాచారం. ఈ క్రమంలోనే డీల్ కోసం వివిధ రాష్ర్టాల్లోని అధికారులకు లంచాల ఎరకు తెర తీసినట్టు తెలుస్తున్నది. ఈ స్కెచ్‌ను సాగర్ అదానీ దగ్గరుండి నడిపినట్టు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఒక్కో మెగావాట్ కొనుగోలుకు రూ.25 లక్షల చొప్పున లంచం ఇచ్చేలా ఒప్పందం కుదిరినట్టు వెల్లడించింది.

### మరి ఇప్పుడు ఎందుకు?

జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతోనే వారెంట్ జారీని 22 రోజులపాటు వాయిదా వేయించి ఉండొచ్చని ఢిల్లీకి చెందిన ఓ రాజకీయ విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు. ఇది నిజమేననిపించేలా.. పోలింగ్ ముగిసిన కొన్ని గంటల్లోనే అదానీ అక్రమాల కహానీ బయటకు రావడం గమనార్హం.

## అమెరికాకు అప్పగించాల్సిందే

గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన నేరారోపణలు రుజువైతే ఆయన్ని భారత్.. అమెరికాకు అప్పగిస్తుందా? అనే చర్చ జరుగుతున్నది. ఇండియా-అమెరికా మధ్య వాషింగ్టన్‌లో జూన్ 25, 1997లో నేరస్తుల అప్పగింత ఒప్పందం కుదిరింది. అమెరికాలో నమోదైన అభియోగాలు నిరూపితమైతే అక్కడే శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఇక నేరం రుజువైతే అదానీని అమెరికాకు భారత్ అప్పగించాల్సి ఉంటుంది.

**బయటపడింది ఇలా..** 22 నెలల కిందట అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ గ్రూప్ కంపెనీల్లో స్టాక్ మ్యానిప్యులేషన్ జరిగినట్టు సంచలన ఆరోపణలు చేసింది. దీనిపై అమెరికాలోని బ్రూక్లిన్ జిల్లా కోర్టులో విచారణ కొనసాగుతున్నది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయవాదులకు సోలార్ ఎనర్జీ కాంట్రాక్టు టెండర్లలోనూ అక్రమాలు జరిగినట్టు అనుమానాలు వచ్చాయి. దీంతో వాళ్లు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు అక్కడి మీడియా వెల్లడించింది. అమెరికాకు అదానీని భారత్ అప్పగించే ప్రక్రియ ఒక్కరోజులో జరిగే పనికాదని న్యాయనిపుణులు చెప్తున్నారు.

## అదానీతో ఒప్పందాలను సమీక్షిస్తాం: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): అదానీతో తమ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు చట్టవిరుద్ధంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. అదానీ కంపెనీలతో ఒప్పందాలపై సీఎం రేవంత్‌రెడ్డికి స్పష్టత ఉన్నదని, రాహుల్‌గాంధీ అభిప్రాయమే తమందరి అభిప్రాయమని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అదానీ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. దోషులుగా తేలితే వాళ్లు కాంగ్రెస్ పార్టీ వారైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి అదానీ రూ.100 కోట్ల విరాళం ఇచ్చిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా.. అవి స్కిల్ యూనివర్సిటీ కోసం ఇచ్చారని, ఒకవేళ అది చట్ట విరుద్ధమైతే రద్దు చేస్తామని చెప్పారు. జాతీయ స్థాయిలో అదానీని రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తుంటే.. తెలంగాణలో మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ విధంగా ఒప్పందాలు చేసుకున్నదని ప్రశ్నించగా.. అందరితో చేసుకున్నట్టుగానే అదానీతోనూ ఒప్పందాలు చేసుకున్నట్టు తెలిపారు.